# ఆంధ్రభూమి వారపత్రిక

డెక్కన్ క్రోనికిల్ సంస్థనుంచి- 1976లో ఆరంభించబడి 32 సంవత్సరాలుగా నిరవధికంగా కొనసాగుతోంది ఆంధ్రభూమి వారపత్రిక. ప్రస్తుతం ఎడిటర్ టి. వెంకట్రామ్‌రెడ్డి, న్యూస్ ఎడిటర్ ఎ.ఎస్. లక్ష్మి. ప్రతి సంచికనీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్న సంపాదకవర్గం అభినందనీయం. ప్రచురించబడిన రచనలకి పారితోషికముంటుంది. కాంప్లిమెంటరీ కాపీ పంపే సంప్రదాయం లేకున్నా- వ్రాసినవారు పత్రిక ఆఫీసుకి వెడితే సగౌరవంగా కాపీ అందజేస్తారు. కుదరనివారు పత్రికకోసం తమ ఏర్పాట్లు తామే చేసుకోవాలి. ఒకప్పుడు సి. కనకాంబరరాజు సారధ్యంలో రచయిత(త్రు)ల్ని తారల్ని చేసి, పాఠకుల్లో పఠనాసక్తిని వ్యామోహంగా మార్చిన ప్రత్యేకత ఆంధ్రభూమిది. మెరుగైన రచనలకోసం తరచుగా పోటీలు నిర్వహిస్తూ, రచయితలకి ఆలంబనగా, పాఠకులకి విజ్ఞానవినోదదాయకంగా కొనసాగుతున్న ఈ 82-పేజీల పత్రికకి మచ్చుగా ఫిబ్రవరి 26, 2009 సంచికని పరిశీలిద్దాం.

అట్టమీద, వెనుక అందాల తారలు. అట్టలోపల కవితలూ, కబుర్లూ. ఉత్తరాల్లో పాఠకుల స్పందనగా 'మీ మెయిల్' (పేజి 5), పాఠకుల వ్యంగ్య హాస్య రచనా ప్రతిభకు అసలు సిసలు 'అల్లరి చేద్దాం' (6), వివిధ దినపత్రికలనుంచి పునర్ముద్రించిన 'రాజకీయ కార్టూనీయం' (8), తెలిసిన సంగతులకే కొత్తకోణంగా ఎ.ఎస్. లక్ష్మి 'అద్దంలో మనం' (9), లాయరు సలహాల- మనకి'లా' (10), నాలుగు సీరియల్స్ (వీటిలో ఒకటి పౌరాణికం), నాలుగు కథలు (వీటిలో ఒకటి అప్పుడప్పుడు అడల్ట్స్ ఓన్లీ), దెయ్యాల వాస్తవగాథల 'అదిగో దెయ్యం' (22), బుక్ రివ్యూ (33), కవితల 'కోయిలా..కూ..యిలా..' (45), రాజకీయ అవగాహన, విశ్లేషణకి 'పవర్ పాలిటిక్స్' (46), సినిమా పజిల్ (55), పిల్లల కథ చెప్పే 'బాలభూమి' (67), మెదడుకు పదును పెట్టే 'గడినుడిగుంచం' (69), జాతకఫలాల 'గ్రహవాణి (71), సభలు, సమావేశాలకి 'సభాయై నమః' (73), అవివాహితులకి 'పెళ్ళి సంబంధం' (78), ఆరోగ్య సూత్రాలతో 'అందరికీ ఆరోగ్యం' (81), వంటలకు 'రుచి' (82), వివిధ అంశాలపై సమయ, సందర్భోచిత వ్యాసాలు, మధ్యమధ్య సరదా కార్టూన్లు, కులాసా కబుర్లు, వెండితెర ముచ్చట్లు.

వీటన్నింటి విలువా వారానికి ఏడు రూపాయలు.